తీరనున్న చిరకాల కోరిక

- తుదిదశకు చేరిన యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణం
- పూర్తి అయిన పైపులైన్ పనులు


యూజీడీ పంపింగ్ స్టేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేరనుంది. డివిజన్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ కనీసం మురుగు కాలువలు లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అలాగే మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసనతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రజల సౌకర్యార్థం అమృత్ పథకంలో భాగంగా యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే యూజీడీ పైపులైన్ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇక్కడి జనాభా అవసరాలకు అనుగుణంగా సంపు, యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మోటార్లు ఏర్పాటు చేస్తున్నామని సాధ్యమైనంత త్వరలోనే పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తామని అంటున్నారు. యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతుండటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రాంతం సుందరంగా మారుతుంది



ఇక్కడ కనీసం మురుగుకాలువలు లేకపోవడంతో వాడిన మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దోమలకు ఆవాస కేంద్రంగా మారింది. యూజీడీ పంపింగ్ స్టేషన్ వినియోగంలోకి వస్తే ఎంతో కాలంగా వేధిస్తున్న దోమల సమస్య కొంత మేర తొలగిపోయే అవకాశం ఉంటుంది. అలాగే ఈ ప్రాంతం సుందరంగా మారుతుంది.

–అర్జా వెంకటేశ్వరరావు, దావు బుచ్చయ్యకాలనీ

మురుగునీటి అవస్థలు తొలగిపోతాయి



యూజీడీ పైపులైన్ పనులు పూర్తయ్యి రెండు సంవత్సరాలు పైగా అయ్యింది. ప్రస్తుతం పంపింగ్ స్టేషన్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. యూజీడీ వినియోగంలోకి వస్తే మురుగునీటి అవస్థలు తొలగిపోతాయి. యూజీడీ పనులు తుది దశకు చేరుకోవడంతో పాటు త్వరలోనే ప్రారంభించనుండటం అభినందనీయం.

– జోగి దుర్గాప్రసాద్, దావు బుచ్చయ్యకాలనీ

రంజాన్ మాసం పవిత్రం


ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కండ్రిక ప్రజాశక్తి నగర్‌లోని మసీద్‌లో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమని అన్నారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఇస్మాయిల్, యరగొర్ల శ్రీరాములు, మాతా మహేష్, శేఖర్, మసీద్ ప్రెసిడెంట్ ఉస్మాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి నూతన కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులంతా వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. చింతామణి నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించామని, రాష్ట్ర ప్రజలు అడగకుండానే వారి సంక్షేమానికి ఏమి కావాలో గుర్తించి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యులుగా కూడా ఆర్యవైశ్యులను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారని చెప్పారు. నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు జిల్లాగా పేరుపెట్టారన్నారు. ఆర్యవైశ్యులకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్యవైశ్యులు అండగా ఉండాలని చెప్పారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కూసుమంచి వెంకటలక్ష్మి, కోశాధికారిగా సోము రమేష్, యువజన విభాగం అధ్యక్షుడిగా కనిగళ్ల అరుణ్ సంపత్, కార్యదర్శిగా చీమకుర్తి శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మారం రోజా రాణి, ప్రధాన కార్యదర్శి దేసు రాజ్యలక్ష్మి, సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి గోపి, ఆయా సంఘాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు తదితరులు హాజరయ్యారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమాభివృద్ధి


సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న చక్రవర్తి

పాయకపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు రెండూ సమప్రాధాన్యతగా జరుగుతున్నాయని సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి అన్నారు. వెలంపల్లి విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఆయన 62వ డివిజన్‌లోని 7 అపార్ట్‌మెంట్స్ వద్ద ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సీఎం జగనన్న అన్ని వర్గాల ప్రజానీకానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మళ్లీ జగనన్న అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా వెలంపల్లి శ్రీనివాసరావును, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూర్ విజయ్, రామిరెడ్డి, బోరా బుజ్జి, హైమావతి, పద్మ, నాగరాజు, వీరబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ


రంజాన్ తోఫా అందజేస్తున్న నాగుల్‌మీరా, కమిటీ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ముస్లింలకు సాయం చేయడమంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని, ఈ రంజాన్ పండుగ వేళల్లో పేద ప్రజలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేదలకు ఒక రూపాయి దానం చేస్తే అది 70 రూపాయలు దానం చేసినంత పుణ్యం వస్తుందన్నారు. ఏఎంసీ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి నెలా ఏదో ఒక సేవా కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. సేవాభావంతో ఈ నెల 100 కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్‌అలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, సమీనాఫాతిమా, షరీఫ్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

నగదు, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఏసీపీ భాస్కరరావు


ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, గోడౌన్స్ యజమానులతో మాట్లాడుతున్న ఏసీపీ

పటమట(విజయవాడతూర్పు): ఓటర్లకు పంపిణీ చేసేందుకు రాజకీయ పార్టీలు సమకూర్చిన డబ్బు, మద్యం, వస్తువులు రవాణా చేసిన వాహన యజమానులపై, నిల్వ చేసిన గోడౌన్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భాస్కరరావు హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, గోడౌన్స్ యజమానులతో ఏసీపీ ఆదివారం సమావేశమయ్యారు. పటమట పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రజలను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ వస్తువులను రవాణా చేసిన వాహనాలను , అలాగే ఈ వస్తువులను నిల్వ ఉంచిన గోడౌన్‌లను సీజ్ చేస్తామని తెలిపారు. అయితే డబ్బు, మద్యం, వస్తువులు రవాణా జరుగుతున్నట్లు, గోడౌన్‌లలో నిల్వ ఉంచేందుకు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు శాతకర్ణి, వల్లిపద్మ పాల్గొన్నారు.

గాలీబ్ షాహీద్ దర్గాలో చాదర్ సమర్పణ


గాలిబ్ షాహిద్ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ఎంపీ కేశినేని నాని, షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ గాలీబ్ షాహీద్ రహమతుల్లాలై 436వ ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. ఉరుసు మహోత్సవంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. సూఫీ మత గురువులకు చాదర్ గంధం, పూలు సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లు గెలవాలని, పార్లమెంట్ సభ్యులుగా కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యేగా షేక్ ఆసిఫ్ గెలవాలని ప్రార్థనలు చేశారు. బాబా వారి గంధ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఫకీర్ల తప్పెట్లు, పాటలు ఉరుసులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దిన్, నాయకులు జీఎంసీ భాషా, స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, చైతన్య రెడ్డి, దర్గా ప్రెసిడెంట్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, కమిటీ పెద్దలు సత్తార్, రెహమాన్, అస్గర్, బద్రుద్దీన్, ఇషాక్, ఖాజా, మైనారిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరం


మాట్లాడుతున్న రజనీకాంత శర్మ, వేదికపై సుబ్బారావు, జర్నలిస్ట్ కృష్ణంరాజు, రామకృష్ణ

విజయవాడకల్చరల్: భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరమని గీతా విజన్ ట్రస్ట్ చైర్మన్ గీతానంద్ పొక్కులూరి సుబ్బారావు అన్నారు. గీతా విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్‌లో గీత అవార్డుల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సుబ్బారావు మాట్లాడుతూ.. సకల వేద సారం భగవద్గీతలో కనిపిస్తుందన్నారు. ప్రతీ ఏటా వివిధ రంగాల్లోని ప్రముఖుల సామాజిక సేవలను గుర్తించి వారికి గీతా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. భగవద్గీత గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథంగా అభివర్ణించారు. వివిధ రంగాలకు చెందిన బొమ్మిరెడ్డి రాజశేఖరరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వి.రజనీకాంత శర్మ పాల్గొన్నారు. దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ రంగాల్లోని వారికి నిర్వాహకులు గీతా అవార్డులను అందజేశారు.

చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు


నున్న చెక్ పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ దుర్గాప్రసాద్, సిబ్బంది

నున్న(విజయవాడరూరల్):గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. కార్లు, వ్యానులు, బైక్‌లను సైతం తనిఖీ చేస్తున్నారు. పవర్‌గ్రిడ్ వద్ద, కండ్రిక భవానీబార్ వద్ద, పైపులరోడ్డు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గత వారం చేసిన తనిఖీల్లో రూ.37లక్షలు నగదు పట్టుకున్నారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను సైతం సీజ్ చేశామని సీఐ దుర్గా ప్రసాద్ చెప్పారు. చెక్‌పోస్టుల్లో రేయింబవళ్లు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నున్న పవర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏలూరు జిల్లా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో పాటు విజయవాడ ఆటోనగర్, గుణదల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. పైపులరోడ్డు జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ, నూజివీడు రాకపోకలు సాగించే వాహనాలు సోదా చేస్తున్నామన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):ఆదివారం పూర్వాభద్ర నక్షత్రం, మాస శివరాత్రిని పురస్కరించుకుని భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో విశేష అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. పంచముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు విశేష పూజా కార్యక్రమాలను జరిపారు.

రేపటి నుంచి ఈశ్వరమ్మ ఆలయంలో ఉగాది సంబరాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గ్రామదేవత శ్రీ ఈశ్వరమ్మతల్లి దేవాలయంలో మంగళవారం నుంచి 10వ తేదీ వరకు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కోశాధికారి డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, సామంతపూడి చిన్నా తెలిపారు. స్థానిక ముత్యాలంపాడులోని శ్రీ ఈశ్వరమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ఉగాది సంబరాలు కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయంభూ ఈశ్వరమ్మతల్లి అమ్మవారు ముత్యాలంపాడు వాసులను కంటికి రెప్పలా కాపాడుతున్నారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆరు గంటలకు మేలు కొలుపు, ఉదయం 6.30 గంటలకు ఈశ్వరమ్మ తల్లి సోదరి శ్రీ మహాలక్ష్మి అమ్మవారు(రావిచెట్టు)కి సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ 108 కడవలతో నీరు పోయడం జరుగుతుందన్నారు. అనంతరం అమ్మవారికి విశేషంగా పూజలు, అభిషేకాలు అర్చనలు, పట్టు వస్త్రాల సమర్పణ జరుగుతాయని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు రవికలు, పసుపుకొమ్ములు, గాజులతో పూజ జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ముత్యాలంపాడు పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు సాగుతుందని చెప్పారు. 10వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మ కృపకుపాత్రులు కావాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దాట్ల శివరామరాజు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో ..

దేవీనగర్ శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి గంగిశెట్టి సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు డాక్టర్ మాచిరాజు వేణుగోపాల్ పంచాంగ శ్రవణం చేస్తారని పేర్కొన్నారు. కావున భక్తులు ఉగాది వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

నేడు రాజేశ్వరస్వామి ఆలయంలో బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు పాత ఇనుముకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయం ముఖ మండపం కొట్టివేయగా వచ్చిన 500 కిలోల పాత ఇనుముకు దేవదాయశాఖాధికారుల సమక్షంలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



హనుమాన్‌జంక్షన్ రూరల్:ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇతోధికంగా సాయం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మనవీడుకు చెందిన వీసం మహేష్ వీవీటీ అమరావతి క్యాంపస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవటంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతూ మానవత సంస్థను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వీసం మహేష్‌కు రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సాయాన్ని అందిస్తామని మానవత సభ్యులు భరోసా ఇచ్చారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు బాణాల నరసింహారావు, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పలు చర్చిల్లో వెలంపల్లి ప్రత్యేక ప్రార్థనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం 29, 30వ డివిజన్‌లలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసకులతో కలిసి సర్వమానవాళి సంక్షేమం కోసం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిల పాస్టర్‌లు ఏసుక్రీస్తు సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొంగితల లక్ష్మీపతి, బీ జానారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కంభం కొండలరావు, కొండపల్లి బుజ్జి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రేపు రాజ్యాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం బాధ్యుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం, జీఆర్కే – పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పాల్గొని సందేశం అందజేస్తారన్నారు. డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో గాయత్రీ బృందం నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

ఠాగూర్ గ్రంథాలయంలో దియా మేకింగ్ పోటీలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో క్రోధి నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల అలంకరణ) పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి విభిన్న రకాల దీపాలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కే రమాదేవి విద్యార్థులకు ఉగాది విశిష్టతను వివరించారు. ఉగాది ప్రకృతికి సంబంధించిన పండుగ అని పేర్కొన్నారు. ప్రకృతిలో అనేక మార్పులు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు తెలుగు పండుగల గురించి తెలుసుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: బెజవాడ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో కొమ్మినేని రత్నకుమారి, మల్లాది స్వాతి, వద్దాది కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ అలీ, శ్రీనివాసరావు, సాయిబాబు, హనుమంతరావు, పీ బ్రహ్మం సినీ గీతాలు ఆలపించారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో మాస శివరాత్రి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఆదివారం మాస శివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.